## తెలంగాణ విద్యుత్‌కు సింగరేణి భరోసా , రాష్ట్ర అవసరాలకే తొలి ప్రాధాన్యం

**ప్రస్తుతం తెలంగాణ విద్యుత్ కేంద్రాలకు 72శాతం బొగ్గు సరఫరా**

**ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా మరింత బొగ్గు సరఫరాకు కార్యాచరణ**

**సింగరేణి--జెన్‌కో సమన్వయ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి**




**కొత్తగూడెం సింగరేణి, జూలై 17 (తెలంగాణ వాణి)** రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేస్తున్నట్లు.. అయితే ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మరింత ప్రాధాన్యత క్రమంలో ఇంకా ఎక్కువ బొగ్గు రవాణా చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్ కో సీఎండీ డాక్టర్ హరీష్ ప్రస్తుత విద్యుత్ డిమాండ్, బొగ్గు ఉత్పత్తి, రవాణా తదితర అంశాలపై తమ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినందున, రాష్ట్ర థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో తగినంత బొగ్గు నిల్వలు ఉండేలా ఇరు సంస్థల సంబంధిత అధికారులు మరింత సమన్వయంతో పనిచేయాలన్నారు. నిరంతరాయ బొగ్గు రవాణాపై పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తామన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న జెన్ కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, రామగుండం ఎన్‌టీపీసీ, సింగరేణి థర్మల్ ప్లాంట్ కోసం సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 72 శాతాన్ని సరఫరా చేస్తున్నట్లు సింగరేణి మార్కెటింగ్ విభాగం అధికారులు సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. అయితే విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తెలంగాణ విద్యుత్ కేంద్రాల అవసరాలకు మరింత ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే బొగ్గు నుంచి సర్దుబాటు చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల అవసరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బొగ్గు ఉత్పత్తి, రవాణా, రైల్వే రేకుల లభ్యత, రోడ్డు రవాణా తదితర అంశాల్లో సింగరేణి, జెన్‌కో అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాకాలంలో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ఆయా ఏరియాల జీఎంలు చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్పత్తి తగ్గొద్దని, నాణ్యతలోనూ రాజీ పడకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. జెన్ కో థర్మల్ కేంద్రాల వద్ద బొగ్గు నిల్వల వివరాలను తెలిపారు. బొగ్గు రవాణాలో ఉన్న ఇబ్బందులపై స్థానిక ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎం.తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్, జెన్ కో డైరెక్టర్లు నాగ్య, రాజశేఖర్, సీఈలు బిచ్చన్న, లక్ష్మయ్య, శ్రీప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## నీట్ లో 8182 ర్యాంకు సాధించిన విద్యార్థినికి అభినందనలు



**కొత్తగూడెం, జూలై 17 (తెలంగాణ వాణి)** కొత్తగూడెంలోని ప్రముఖ మెడికేర్ డయాగ్నస్టిక్ సెంటర్ అధినేత డాక్టర్ వేమిశెట్టి ఉపేంద్రరావు మనవరాలు, డాక్టర్ ప్రవీణ్ – డాక్టర్ సిరి దంపతుల కుమార్తె నైషా ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. 720 మార్కులకు 606 మార్కులు సాధించి, దేశవ్యాప్తంగా పరీక్ష రాసిన సుమారు 23 లక్షల మంది విద్యార్థులలో ఆల్ ఇండియా లెవల్ లో 8182వ ర్యాంకు సాధించడం విశేషం. ఈ సందర్భంగా ఆమె సాధించిన విజయం పట్ల కుటుంబ సభ్యులు, వైద్య వర్గాలు, స్నేహితులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉత్తమ వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయం నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, పట్టుదల, కృషి ఉంటే లక్ష్యాలను తప్పక చేరుకోవచ్చని విద్యావేత్తలు పేర్కొన్నారు.

# సిద్ధులగుట్టలో ఆధ్యాత్మిక వైభవం

## ఘటాభిషేక--చండీ మహాయాగం ఘనారంభం



**జనగామ/బచ్చన్నపేట, జూలై 17 (తెలంగాణ వాణి)** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామంలోని సిద్ధులగుట్ట శ్రీ గురు దత్తాత్రేయ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఘటాభిషేక రుద్ర--సుదర్శన--అరుణ సహిత చండీ మహాయాగం శుక్రవారం ఆధ్యాత్మిక వైభవంతో ప్రారంభమైంది. వేదవేద్యా ధర్మ వేదిక ఆధ్వర్యంలో శ్రీ సిద్ధేశ్వర దేవస్థాన పరిధిలో జరుగుతున్న ఈ మహాయాగంలో తొలి రోజు భక్తుల సందడి నెలకొంది.



ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం వేదఘోషలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. వేద పండితులు శాస్త్రోక్తంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, మంటపారాధన, విశేష విగ్రహారాధన, శ్రీచక్రార్చన, ఘటాభిషేకం, గణపతి దూర్వా హోమం, చండీ హోమం తదితర క్రతువులను వైభవంగా నిర్వహించారు. ఈ మహాయాగానికి వారణాసి నుంచి విచ్చేసిన శ్రీశ్రీశ్రీ గోవిందాశ్రమ్ దండి స్వామివారు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఆశీర్వదించిన స్వామివారు సనాతన ధర్మ పరిరక్షణలో యజ్ఞయాగాల ప్రాముఖ్యతను వివరించి ఆధ్యాత్మిక సందేశం అందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన వేద పండితుల సమక్షంలో మహాయాగం శాస్త్రోక్తంగా కొనసాగుతోంది. దేశ క్షేమం, లోకశాంతి, సకాల వర్షాలు, సుభిక్షం, ప్రజల ఆయురారోగ్యాలు, ఆధ్యాత్మిక చైతన్యం కోసం ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు . తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి యాగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీ గురు దత్తాత్రేయ స్వామి, శ్రీ సిద్ధేశ్వర స్వామివారి ఆశీస్సులు పొందారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ మహాయాగంలో విశిష్ట పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వేదవేద్యా ధర్మ వేదిక ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ సూచనలు




**చుంచుపల్లి, జూలై 17 ( తెలంగాణ వాణి)** వ్యవసాయ శాఖ ధ్వర్యంలో మండలంలోని పెనగడప గ్రామంలో రైతులకు ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి. రాజేశ్వరి మాట్లాడుతూ, వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఎల్ నినో (జుశ్రీ చీఅశీ) అనేది మధ్య, తూర్పు భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల నీటి ఉష్ణోగ్రత సాధారణం కంటే అధికంగా పెరగడం వల్ల ఏర్పడే సహజ వాతావరణ దృగ్విషయమని వివరించారు. దీని ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా గాలి ప్రవాహాలు, వర్షపాత విధానాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో భారతదేశంలో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉండటంతో పాటు కొన్ని ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యంగా లేదా తక్కువగా కురిసే పరిస్థితులు ఏర్పడవచ్చని, ఉష్ణోగ్రతలు పెరిగి కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలు కూడా ఉన్నాయని చెప్పారు. అయితే ఎల్ నినో వచ్చిన ప్రతిసారి అన్ని ప్రాంతాల్లో కరువు వస్తుందని భావించడం సరైంది కాదని, ప్రాంతాల వారీగా ప్రభావం మారుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం చుంచుపల్లి మండలంలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని కోరారు. ముఖ్యంగా నీటి అవసరం తక్కువగా ఉండే పప్పు దినుసులు, జొన్న, సజ్జ, కొర్రలు వంటి చిరుధాన్యాలు ప్రత్యామ్నాయ పంటలుగా సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెనగడప గ్రామ సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ పటాన్ మహామూద్ ఖాన్, ఏఈఓ మమత, పంచాయతీ కార్యదర్శి సురేష్, జీపీఓ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కన్నవారి కంట కన్నీరే సకల అనర్థాలకు మూలం

## షేక్ అబ్దుల్ బాసిత్, జమాతే ఇస్లామి హింద్ సభ్యులు



**కొత్తగూడెం, జూలై 17 (తెలంగాణ వాణి)** మన ఉనికి కి మూలాధారమైన తల్లిదండ్రుల సేవ లోనే మనందరి సుఖసంతోషాలు దాగి ఉన్నాయని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు ప్రముఖ మోటివేషన్ స్పీకర్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు.పవిత్ర శుక్రవారం సందర్భంగా మెదర బస్తి, గణేష్ టెంపుల్ పరిదిలో కల "మస్జీద్ ఏ వహీద్ " జరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ, మనిషి ఆయువు, ఆరోగ్య, ఐశ్వర్యాల వృద్ధి తల్లిదండ్రుల సేవ లో దాగి ఉన్నాయని ప్రవక్త ముహమ్మద్ తెలిపారని, తమ సంతానం సుఖసంతోషాల కోసం, వారి భవిష్యత్తు భవ్యంగా ఉండాలని తమ సర్వస్వాన్ని త్యాగం చేసే తల్లిదండ్రుల పట్ల మంచితనం తో వ్యవహరించాలని సృష్టి కర్త అల్లాహ్ ఖురాన్ లో ఆదేశించదని అన్నారు. వారు ముసలి వారైతే, వారిని "ఉఫ్," అని కూడా అనరాదని వారితో కసురుకుంటు సమాదానం ఇవ్వరాదని, బాల్యం లో వారు ఎలాగైతే వాత్సల్యం ప్రేమతో వ్యవహరించారో అలా సంతానం వ్యవహరించాలి కోరారు. మన తల్లిదండ్రులతో పాటు ఇతరుల తల్లిదండ్రులను కూడా గౌరవించడం నిజమైన ఆరాధన అని అన్నారు. ఆధ్యాత్మికత అంటే కేవలం నమాజ్, రోజా హజ్ లు మాత్రమే కాదని మన సంబంధితులతో మన వ్యవహారాలు కూడా మనకు పుణ్యాలు ప్రాసాదించే మార్గాలని అన్నారు. ప్రతి ధర్మం కన్నవారి కంట కన్నీరు పెట్టించరాదని బోధిస్తున్నాయని, తండ్రి ఇచ్చి మాట కోసం పద్నాలుగు సంవత్సరాలు రాజ్యాన్ని వదలి వనవాసం చేసిన రాముడు. అంధులైన తల్లిదండ్రులను కావడిలో మోసుకొని తీర్థయాత్రలు చేయించిన శ్రావణుడు, తండ్రి సంతోషంలోనే దేవుని సంతోషం దాగి ఉందని చెప్పిన ప్రవక్త ముహమ్మద్ సల్లేల్లాహు అలైహి వస్సలం బోధనలను ఆదర్శంగా తీసుకొని కన్న తల్లిదండ్రులకు సేవ చేసి వారి ఋణం తీర్చుకోవాలి అని బోధనలను ఆదర్శం గా తీసుకుని మనం మన కన్నవారికి సేవ చేస్తే జీవితం తరిస్తుంది అని అన్నారు.



# కారుణ్య నియామకం మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా

## ఇద్దరు అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన జెడ్పీ సీఈవో బి. నాగలక్ష్మి



**కొత్తగూడెం, జూలై 17 (తెలంగాణ వాణి)** విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న కారుణ్య నియామక పథకం ఆర్థిక భరోసాను కల్పిస్తుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి బి. నాగలక్ష్మి అన్నారు. జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కారుణ్య నియామకం కింద ఇద్దరు అర్హులైన అభ్యర్థులకు కార్యాలయ సహాయకులుగా నియామక పత్రాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ నియామకం పొందిన అభ్యర్థులు అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ అధ్యక్షులు పి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి దేవేందర్, సంఘ సభ్యుడు విజయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు జెడ్పీ సీఈవో, అధికారులకు కృతజ్ఞతలు తెలిపి, నియామకం పొందిన అభ్యర్థులను అభినందించారు.

# మాజీ జీపు డ్రైవర్ చింత సురేష్ పార్థివ దేహానికి ట్రాఫిక్ ఎస్ఐ నివాళి

## కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన ప్రవీణ్ కుమార్



**లక్ష్మీదేవిపల్లి, జూలై 17 (తెలంగాణ వాణి):** లక్ష్మీదేవిపల్లి మండల పోలీస్ స్టేషన్‌లో గతంలో తాత్కాలిక జీపు డ్రైవర్‌గా విధులు నిర్వహించిన చింత సురేష్ మృతి పట్ల కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురేష్ మరణవార్త ఆలస్యంగా తెలిసినప్పటికీ వెంటనే స్పందించిన ఆయన అంతిమయాత్రలో పాల్గొని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తాను లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన సమయంలో సురేష్‌తో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, ఆయన నమ్మకస్తుడని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని కొనియాడారు. సురేష్ అకాల మరణం బాధాకరమని పేర్కొన్న ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఆ కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అంతిమయాత్రలో స్థానిక పోలీసు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పూనెం శ్రీనివాస్, తాటి పద్మ, మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొని నివాళులర్పించారు.

# వాస్తవాలను ఎదుర్కొనే ధైర్యం లేనివారే అసత్య ఆరోపణలు చేస్తారు

సింగరేణి బీఎంఎస్‌లో భారీగా కార్మికుల చేరికలు

బీఆర్ఎస్--టీబీజీకేఎస్ విమర్శలకు మాధవ్ నాయక్ కౌంటర్



**కొత్తగూడెం సింగరేణి జూలై 17 (తెలంగాణ వాణి)** కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి 'సింగరేణి భరోసా యాత్ర'పై బిఆర్ఎస్-- టీబీజీకేఎస్ విమర్శలు వాస్తవాలను కప్పిపుచ్చే విఫల ప్రయత్నం చేస్తున్నాయని ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్ వ్యాఖ్యానించారు. శుక్రవారం కొత్తగూడెంలోని బీఎంఎస్ భవన్‌లో కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షుడు బి. రామ్ సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ లో వివిధ కార్మిక సంఘాలకు చెందిన ఉద్యోగులు భారీ సంఖ్యలో చేరారు.ఈ సందర్భంగా ఐఎన్టియుసి తో పాటు ఇతర కార్మిక సంఘాలకు చెందిన మెయిన్ వర్క్‌షాప్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, కొత్తగూడెం ఏరియా ఆర్ సి హెచ్ పి విభాగాలకు చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా సింగరేణి బి.ఎం.ఎస్ లో చేరి సంఘం పట్ల తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మెయిన్ వర్క్‌షాప్ నుండి చేరిన సభ్యులు జి. కోదండరాం,ఫోర్‌మన్, బి. నరేష్ -- టర్నర్,మిషినిస్ట్, ఎం. వీరన్న -- టర్నర్, బి. రాము, ఫిట్టర్, జి. మోహన్‌రావు, టర్నర్, నాగరాజు -- టర్నర్, బి. శివ -- టర్నర్, బి. సంపత్ కుమార్ -- టర్నర్, బి. కిరణ్ -- ఫిట్టర్, వి. దుర్గ -- జనరల్ మజ్దూర్,మైన్స్ రెస్క్యూ స్టేషన్ నుండి బి ఎం ఎస్ లో చేరడం జరిగింద ఓవర్ మెన్ బి. నాగేశ్వరరావు, ఫిట్టర్ రాంబాబు,కొత్తగూడెం ఏరియా ఆర్ సి హెచ్ పి నుండి చేరిన సభ్యురాలు బానోత్ దేవి బి ఎం ఎస్ లు చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాధవ్ నాయక్ మాట్లాడారు.వాస్తవాలను ఎదుర్కొనే ధైర్యం లేనివారే విమర్శలను ఆయుధంగా చేసుకుంటారని, కానీ ఏబీఎంఎస్, బి ఎం ఎస్ మాత్రం కార్మికుల హక్కులు, సింగరేణి అభివృద్ధి కోసం రాజీ లేని పోరాటం చేస్తామని ఆ యూనియన్ జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్ స్పష్టం చేశారు. నూతనంగా సంఘంలో చేరిన సభ్యులందరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు. వారి చేరిక సింగరేణి బి ఎం ఎస్ పై కార్మికుల్లో రోజురోజుకూ పెరుగుతున్న విశ్వాసానికి, సంఘం చేపడుతున్న పోరాటాలపై ఏర్పడిన నమ్మకానికి నిదర్శనమని అన్నారు. అలాగే కేంద్ర బొగ్గు అండ్ గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సింగరేణి భరోసా యాత్ర' పై బిఆర్ఎస్ పార్టీ, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘ్ ( టీబీజీకేఎస్) నాయకులు చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, వాస్తవాలను ప్రజల దృష్టి నుంచి మళ్లించే విఫల ప్రయత్నమని విమర్శించారు.సింగరేణి ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి మూలకారణం గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ విధానాలేనని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వాటి పరిష్కారంలో విఫలమై బకాయిలను మరింత పెంచిందన్నారు. ఫలితంగా సింగరేణిపై ప్రస్తుతం సుమారు రు.54 వేల కోట్ల బకాయిల భారం పడిందని ఉద్యోగుల జీతాలను సైతం ఓవర్‌డ్రాఫ్ట్ ద్వారా చెల్లించాల్సిన దుస్థితి నెలకొనడం బాధాకరమని పేర్కొన్నారు.అలాంటి పరిస్థితికి కారణమైనవారే ఇప్పుడు కార్మికుల సంక్షేమంపై మొసలి కన్నీళ్లు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. ముందుగా తమ పాలనలో జరిగిన వైఫల్యాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. కోయగూడెం, జేవీఆర్ ఓసీ వంటి బొగ్గు గనుల వేలంపాటలలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుపడి, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రైవేటు సంస్థలకు అవకాశాలు కల్పించిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. ఆ నిర్ణయాల వల్ల సింగరేణికి జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.జి. కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, దశాబ్దకాలంగా నిలిచిపోయిన నైనీ బొగ్గు గనికి అవసరమైన అనుమతులు సాధించి, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి మార్గం సుగమం చేశారని గుర్తు చేశారు. అక్కడి నుంచి లభించే ఆదాయం సింగరేణి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికే ఉపయోగపడుతుందని తెలిపారు.అదేవిధంగా వీకే ఓసీ, గోలేటి ఓసీ, పూసపల్లి ఓసీ వంటి కీలక ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం సింగరేణి విస్తరణకు, భవిష్యత్ అభివృద్ధికి ఎంతటి ప్రాధాన్యత ఇస్తోందో స్పష్టమవుతోందన్నారు.గతంలో తాడిచెర్ల--× బొగ్గు గనిని ప్రైవేటు సంస్థకు అప్పగించి సింగరేణికి తీవ్ర అన్యాయం చేసినవారే, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనన్నారు. అయితే 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు కలిగిన తాడిచెర్ల--×× బొగ్గు బ్లాక్‌ను ఎలాంటి వేలంపాట లేకుండా నేరుగా సింగరేణికి కేటాయించడం ద్వారా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సింగరేణి పట్ల తన చిత్తశుద్ధిని కార్యరూపంలో నిరూపించారని పేర్కొన్నారు. ఈ నిర్ణయం కార్మికుల్లోనూ, ప్రజల్లోనూ విశేష ఆదరణ పొందిందన్నారు.సింగరేణి భరోసా యాత్ర' ద్వారా సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక వాస్తవాలు, గత ప్రభుత్వాల విధానపరమైన వైఫల్యాలు ప్రజల ముందుకు రావడంతో వాటిని జీర్ణించుకోలేక బిఆర్ఎస్-- టీబీజీకేఎస్ నాయకులు నిరాధార ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు.వాస్తవాలను ఎదుర్కొనే ధైర్యం లేనివారే విమర్శలను ఆయుధంగా చేసుకుంటారు. కానీ ఎబికేఎంఎస్- బిఎంఎస్ మాత్రం కార్మికుల హక్కులు, సింగరేణి భవిష్యత్, సంస్థ అభివృద్ధి కోసం రాజీపడకుండా తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని పి. మాధవ నాయక్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జి.వి. కృష్ణారెడ్డి, టి.ఎస్. పవన్ కుమార్, మొగిలిపాక రవి, బాలకృష్ణ, అశోక్, ప్రవీణ్, నరేష్, కాసర్ల మోహన్, శైలేష్ కిరణ్, భీమా, శ్రావణ్ కుమార్, రాజేష్, చంద్రశేఖర్, వడ్డీ కాసులు, నరేష్, మోహన్ లాల్, ధారావత్ నాగేశ్వరరావు, దినేష్, సుధాకర్, సంగం చెందర్, అల్లి ప్రకాష్, ఏం శ్రీనివాస్, ఐనపనూరి నాగేశ్వరావు,రాకేష్, తదితరులు పాల్గొన్నారు.





# ఖమ్మంకు బదిలీపై వెళ్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మికి ఘన సన్మానం



కొత్తగూడెం, జూలై 17 (తెలంగాణ వాణి): ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్తున్న కొత్తగూడెం పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి. లక్ష్మిని శుక్రవారం కొత్తగూడెం న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ, లక్ష్మి తన పదవీకాలంలో నిజాయితీ, నిష్పక్షికతతో విధులు నిర్వహించి న్యాయవ్యవస్థకు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. అనంతరం ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి, ఖమ్మంలోనూ మరిన్ని ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# కొత్తగూడెంకు నైపుణ్యాభివృద్ధి కేంద్రం మంజూరు

### 10 కోట్ల నిధులు విడుదల.. ఎమ్మెల్యే కూనంనేని హర్షం



**కొత్తగూడెం, జూలై 17 (తెలంగాణ వాణి)** కొత్తగూడెంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇస్తూ తొలి విడతగా రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. మూడు ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఈ కేంద్రంలో ప్రతి ఏడాది సుమారు వెయ్యి మంది నిరుద్యోగ యువతకు వివిధ వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఈ కేంద్రం కొత్తగూడెం యువతకు ఉపాధి అవకాశాలు పెంచడంలో కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఎమ్మెల్యే కూనంనేని కృతజ్ఞతలు తెలిపారు.

# ఓటు మన రాజ్యాంగ హక్కు - దాన్ని కాపాడుకోవాలి

### సమాజ మార్పు కోసం ఓటును ఆయుధంగా మలుచుకోవాలి

### రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి పిలుపు



**కొత్తగూడెం, జూలై 17 (తెలంగాణ వాణి)** భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం 18 ఏళ్లుదాటిన ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు ఉందని, సమాజ మార్పు, పారదర్శక ప్రజాస్వామ్యం కోసం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును రక్షించుకోవాలని రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ "ఎస్.ఐ.ఆర్" గడువును జూన్ 25 నుండి జూలై 24 వరకు నుండి ఆగస్టు 3 వరకు పొడిగిస్తూ స్టేట్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. నిర్ణీత సమయంలో ఓటు హక్కు నమోదు చేసుకోకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్య రక్షణ, పీడిత ప్రజల హక్కుల సాధన కోసం ఓటు హక్కును ఆయుధంగా మలుచుకోవాలన్నారు. ఓటును కాపాడుకుని రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాల్సిన అవసరం ఉందని, ఓటు కోల్పోతే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు.బిఎల్ఓలు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను నింపి తిరిగి వారికి అందించి సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జల్లేపల్లి కాశీ విశ్వనాథం, మంచికంటి వెంకయ్య, జుబేద్ ఆలం, ఇర్ఫాన్, యకూబ్ తదితరులు పాల్గొన్నారు.